జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు
ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 99 మంగళవారం 2 సెప్టెంబరు – 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

# సీఎం కీలక ప్రకటన




హైదరాబాద్, సెప్టెంబర్ 01(సందేశం టైమ్స్): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాలు, వరదల నష్టంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సమీక్షించారు. వర్షాల కారణంగా 1,052 చోట్ల 1,023 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని సీఎం దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని వారిని ఆదేశించారు.అలాగే గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు రాక పోవడంపై సీఎం ఆరా తీశారు. ఈ అంశాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. ఇక భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని చెప్పారు.ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే నివేదిక సైతం అందజేయాలని సూచించారు.గత ఏడాది ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్.. వరదల సమయంలో బాగా పని చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో ఎన్డీఆర్ఎఫ్‌తో పని లేకుండా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. హెచ్ఎండీఏ పరిధిలో చెరువులను వెంటనే నోటిఫై జరగాలని ఆదేశించారు.అయితే వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం అందజేయాలని అధికారులకు సూచించారు. అలాగే చనిపోయిన జంతువులకు సైతం పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ఈ సందర్భంగా కలెక్టర్లకు స్పష్టం చేశారు. కింద స్థాయి అధికారులు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలు జిల్లాలోనే ఉండి నిరంతరం అప్రమత్తంగా ఉండి.. పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమగ్ర నివేదిక తయారు చేసి కేంద్రానికి అందజేయాల్సి ఉందని అధికారులకు తెలిపారు.




హైదరాబాద్: సెప్టెంబర్ 01(సందేశం టైమ్స్): ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కవితకు బిగ్ షాక్ ఇచ్చారు. కవితకు కౌంటర్ ఇస్తూ.. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ట్వీట్‌ను కేటీఆర్ రీట్వీట్ చేశారు. డైనమిక్ లీడర్ హరీష్‌రావు ఇచ్చిన మాస్టర్ క్లాస్ అంటూ.. పేర్కొన్నారు. నీటిపారుదల గురించి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు.. కేసీఆర్ ప్రియశిష్యుడు హరీష్ ఇచ్చిన పాఠం ఇది అంటూ.. ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.కవిత చేసిన కామెంట్స్‌పై బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో హరీష్ రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే.. మాజీ సీఎం కేసీఆర్ కేటీఆర్, మధుసూదనాచారీ, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీష్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డిలతో సమావేశం అయ్యారు. దానితో పాటు బీఆర్ఎస్ మీడియా వాట్సాప్ గ్రూప్స్ నుంచి కవిత పీఆర్వోను బీఆర్ఎస్ తొలగించింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు బీఆర్ఎస్ శ్రేణుల్లో నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొత్త పార్టీకి కవిత రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ మేరకు బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కాగానే కవిత కొత్త పార్టీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే.. రేపు కవితపై బీఆర్ఎస్ పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుంది అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## కవిత కు బిగ్ షాక్ ఇచ్చిన కేటీఆర్



సెప్టెంబర్ 01(సందేశం టైమ్స్): మాజీ మంత్రి హరీష్ రావు పై ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు చేసిన నేపథ్యంలో, కేటీఆర్ చేసిన ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి హరీష్ రావు, సంతోష్ రావులే కారణమని, వారి వల్లే కేసీఆర్‌కు ఈ పరిస్థితి వచ్చిందని కవిత ఆరోపించారు. అయితే, కవిత వ్యాఖ్యలను పరోక్షంగా ఖండిస్తూ, కేటీఆర్ తన ట్వీట్‌లో హరీష్ రావుకు పూర్తి మద్దతుగా నిలిచారు. బీఆర్ఎస్ అధికారిక అకౌంట్ పోస్ట్ చేసిన ఒక వీడియోను ఆయన రీట్వీట్ చేస్తూ "ఇది మా డైనమిక్ లీడర్ హరీష్ రావు ఇచ్చిన మాస్టర్ క్లాస్" అని క్యాప్షన్ ఇచ్చారు.అల్లుడికి అన్న మద్దతు

కేటీఆర్ చేసిన ట్వీట్‌లో హరీష్ రావును ప్రశంసిస్తూ, ఆయన ఇరిగేషన్ శాఖ గురించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు నేర్చుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ట్వీట్ ద్వారా, హరీష్ రావుపై వచ్చిన అవినీతి ఆరోపణలను కేటీఆర్ ఖండించడమే కాకుండా, పార్టీలో ఆయనకున్న ప్రాముఖ్యతను పరోక్షంగా తెలియజేశారు. కవిత వ్యాఖ్యల అనంతరం కేటీఆర్ వెంటనే స్పందించడం, హరీష్ రావుకు మద్దతు తెలపడం పార్టీలో నెలకొన్న

## లండన్ లో హరీష్ రావు..ఇదేం ట్విస్ట్..?



సెప్టెంబర్ 01(సందేశం టైమ్స్): ఆదివారం అర్ధరాత్రి వరకూ అసెంబ్లీలో కాళేశ్వరం రిపోర్టు పై తీవ్రంగా పోరాడిన హరీష్ రావు, సోమవారం సాయంత్రానికే లండన్‌లో ప్రత్యక్షమవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అసెంబ్లీలో జరిగిన పరిణామాలపై చర్చించేందుకు ఉదయం ఫామ్‌హౌస్‌కు వెళ్లిన నేతల్లో హరీష్ రావు లేకపోవడంతో ఆయన ఎక్కడ ఉన్నారన్న సందేహాలు మొదలయ్యాయి. అయితే లండన్ విమానాశ్రయంలో ఆయనకు ఎన్నారై కార్యకర్తలు స్వాగతం పలికిన ఫోటోలు బయటకు రావడంతో ఆయన విదేశాల్లో ఉన్న సంగతి స్పష్టమైంది. కుమార్తె ఉన్నత చదువుల కోసం కాలేజీలో చేర్పించేందుకు లండన్ వెళ్లారని బీఆర్ఎస్ వర్గాలు చెప్పాయి.

## సీబీఐ పేరుతో ప్రధాని, సీఎం కుట్ర



హైదరాబాద్, సెప్టెంబర్ 01(సందేశం టైమ్స్) : కాళేశ్వరంపై విచారణ పేరుతో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి, గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించే కుతంత్రాలకు తెరదీశారని విమర్శించారు.ఈ రోజు పార్టీ శ్రేణులతో ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగించడమంటే ప్రాజెక్టును పూర్తిగా ఎండబెట్టడమే అని కేటీఆర్ అన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను ప్రధాని మోడీ జేబు సంస్థలుగా విమర్శించిన సీఎం రేవంత్ రెడ్డి 48 గంటల్లో ఎందుకు మాట మార్చారో చెప్పాలన్నారు.

## కేసీఆర్ ఫామిలీకి సంబంధించిన విషయంలో మేము తలదూర్చం – కోమటిరెడ్డి



సెప్టెంబర్ 01(సందేశం టైమ్స్): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన సంచలన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన అంతర్గత విషయాలలో కాంగ్రెస్ పార్టీ జోక్యం చేసుకోదని ఆయన స్పష్టం చేశారు. అయితే, కవిత తన వ్యాఖ్యలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రస్తావించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎవరైనా సరే తమ ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెచ్చరించారు. కవితనే కాదు, మరెవరైనా రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేసినా తాము ప్రతిస్పందిస్తామని ఆయన అన్నారు.కాళేశ్వరం దొంగలు ఎవరో తేలుతుంది కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కవిత ఆరోపణల నేపథ్యంలో ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతికి అసలు దొంగలు ఎవరో సీబీఐ దర్యాప్తులో తేలుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే కాళేశ్వరంపై విచారణను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, కవిత చేసిన వ్యాఖ్యలు విచారణకు మరింత బలం చేకూర్చాయని ఆయన అన్నారు. ఈ మొత్తం వ్యవహారం బీఆర్ఎస్‌లో నెలకొన్న తీవ్రమైన అంతర్గత కలహాలను సూచిస్తోందని ఆయన తెలిపారు.

## తెలంగాణ వైద్య విద్య.. స్థానికతపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

సెప్టెంబర్ 01(సందేశం టైమ్స్): తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థుల స్థానికత అంశంపై పలు వివాదాలు రేకెత్తిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసులో సుప్రీం కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. తెలంగాణలో వైద్య విద్య చదివాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ళ స్థానికత తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సమర్థించింది.గతంలో రాష్ట్ర హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవాల్సిందే అన్న నిబంధనను సుప్రీంకోర్టు సమర్థించింది.

# సంపాదకీయం

## ఎమ్మెల్యేలు వసూల్ రాజాలు

తెలుగునాట.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలువురు శాసనసభ్యులు వారి ముఖ్యమంత్రులకు కంట్లో నలుసుల్లా తయారవుతున్నారా? ఎం.ఎల్.ఎ. అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. అంటే చట్టసభ సభ్యులు. చట్టసభల్లో చట్టాలు చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన శాసనసభ్యులే ఇప్పుడు ప్రజలపాలిట సమస్యగా మారుతున్నారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కొంత మంది శాసనసభ్యులు లేని అధికారాలను సంక్రమింప జేసుకొని ఆయా నియోజకవర్గాలలో ప్రజలు గాలి పీల్చుకోవాలన్నా తమ అనుమతి తప్పనిసరి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. 2004 నుంచి ప్రారంభమైన ఈ ధోరణి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వెర్రితలలు వేస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో శాసనసభ్యులకు అపరిమిత స్వేచ్ఛను ఇవ్వడంతో వారు ప్రభుత్వ కార్యాలయాలను తమ అజమాయిషీలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు కూటమి ఎమ్మెల్యేలకూ అదే ఆదర్శమైంది. గతానికి భిన్నంగా ఈ జాఢ్యం ఇప్పుడు తెలంగాణకు కూడా విస్తరించింది. 2009లో ఎమ్మెల్యేగా ఎన్నికైన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మంచినీటి సరఫరా, డ్రైనేజీ వంటి స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వారిని ఉద్దేశించి, వాటి గురించి స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లకు చెప్పాలని సూచించేవారు. ఇది ప్రజలకు రుచించలేదు. అది వేరే విషయం! 1983కు ముందు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉనికి ఉండేది కాదు. అక్కడి ప్రజా సమస్యలను స్థానిక సంస్థలే పరిష్కరించేవి. అప్పట్లో ఎమ్మెల్యేలు ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండేవారు కారు. ఎమ్మెల్యేలను కలుసుకోగలిగే పరిస్థితి జిల్లా స్థాయిలో కొద్దిమందికే ఉండేది. ఇక మంత్రులు, జిల్లా కలెక్టర్లను కలుసుకోవడం అరుదైన అవకాశంగా ఉండేది. అలా కలుసుకోగలిగిన వారికి పలుకుబడి ఉన్నట్టు పరిగణించేవారు. ఆ తర్వాత ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారు. దీంతో ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగక తప్పలేదు. ఫలితంగా ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలను, కుటుంబ పంచాయితీలను పరిష్కరించవలసిందిగా కూడా ఎమ్మెల్యేలను కోరేవారు. మొగుడూ పెళ్లాల పంచాయితీలు తామెందుకు పరిష్కరించాలని ఆ రోజుల్లో ఎమ్మెల్యేలు విసుక్కొనేవారు. హైదరాబాద్‌లో ఉండే తమ ఎమ్మెల్యేలను తెలంగాణ జిల్లాలకు చెందిన ప్రజలు వచ్చి కలుసుకొని బాధలు చెప్పుకొనేవారు. కొంతమందైతే తిరుగు ప్రయాణాలకు చార్జీలు ఇవ్వవలసిందిగా ఎమ్మెల్యేలను కోరేవారు. తమను కలవడానికి వచ్చిన వారికి కాఫీ, టీలు తాగించడంతో పాటు భోజనం, వసతి కూడా ఏర్పాటు చేయవలసి రావడంతో శాసనసభ్యులు ఆర్థికంగా నలిగిపోయేవారు. పెళ్లిళ్లు, చావులకు వెళ్లడం విధిగా మారింది. అదే సమయంలో ఖర్చుల కోసం డబ్బు కూడా డిమాండ్ చేసేవారు. తెలంగాణలో ఇప్పటికీ ఈ పరిస్థితి ఉంది. కొంత కాలం క్రితం ఒక లారీ డ్రైవర్ తమ నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి తాను డ్యూటీ మీద దూరంగా ఉన్నాననీ, పురిటి నొప్పులతో బాధపడుతున్న తన భార్యను ఆస్పత్రిలో చేర్పించి ప్రసవం చేయించవలసిందిగా కోరారు. ఇలాంటి విచిత్రమైన అనుభవాలను శాసనసభ్యులు గతంలో పంచుకొనేవారు. ఇదంతా గతం. ఇప్పుడు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలకు సామంత రాజులుగా, దండ నాయకులుగా తయారయ్యారు. తెలంగాణలో కూడా ఈ పోకడలు మొదలయ్యాయి. తెలంగాణలో యూరియా కొరత ఇప్పుడు ప్రధాన సమస్యగా ఉంది.రైతులు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన రామగుండం ఎరువుల కంపెనీ తెలంగాణలో ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలు తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో యూరియా కొరత మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఏమి చేస్తారు? ఎరువుల ఫాక్టరీలో మరమ్మతులను వేగంగా పూర్తిచేయించి ఉత్పత్తి తిరిగి ప్రారంభమయ్యేలా చేస్తారు. కానీ అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతుల కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులు తనను కలసి తన సంగతి ఏమిటో తేల్చకపోతే ఎలా అని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ వ్యవహారం మంత్రి, ముఖ్యమంత్రి వరకూ వెళ్లింది. దీంతో సంబంధిత శాఖ మంత్రి కల్పించుకొని సదరు ఎమ్మెల్యేను పిలిపించుకొని సర్దిచెప్పారు. ఈ ధోరణిని ఏమనాలి? ఇల్లు తగలబడుతుంటే బొగ్గులు ఏరుకోవడానికి ప్రయత్నించినట్టుగా లేదా? కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన కూడా తమ పార్టీ ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ విషయంలో ఒకరికొకరు ఆదర్శం అయ్యారు. ఫలితంగా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కట్టాలన్నా శాసనసభ్యుడి అనుమతి ఉండాలని నిర్దేశించారు. దీంతో యావత్ అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఒకవైపు లేని అధికారాలను అనుభవిస్తూ, మరోవైపు భూ కబ్జాలు, దందాలలో ఎమ్మెల్యేలు మునిగితేలారు. ఫలితంగా 2023 ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితికి చెందిన శాసనసభ్యులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థులను మార్చకుండా పాతవాళ్లు అందరికీ టికెట్లు ఇచ్చారు. అప్రతిష్ఠపాలైన శాసనసభ్యులను మార్చి ఉంటే కేసీఆర్ అధికారం కోల్పోయి ఉండేవారు కాదన్న అభిప్రాయం భారత రాష్ట్ర సమితి ముఖ్యులలో ఇప్పటికీ ఉంది.

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**సంగారెడ్డి జిల్లా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి- పి ప్రవీణ్య జిల్లా కలెక్టర్.**

**శిక్షణ అనంతరం మంచి నైపుణ్యం గల వ్యక్తులుగా బయటకు రావాలి.**

**ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకుంటూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి.**

**బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ కమిషన్ పరీక్షలకు శిక్షణను ప్రారంభించిన కలెక్టర్.**



సందేశం టైమ్స్ :సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి సెప్టెంబర్ 1 ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య , సోమవారం సంగారెడ్డి లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల కు చెందిన నిరుపేద కుటుంబాలకు చెందిన యువకులకు ఉన్నత ఉద్యోగుల సాధన కోసం ప్రారంభించిన %ఱ+ూాజ% గ్రూప్ ఎగ్జామ్ లు, కమిషన్ పరీక్షలు, బ్యాంకింగ్ పరీక్షల శిక్షణ తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నిర్దేశించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో %ఱ+ూాజ% గ్రూప్స్ పరీక్షలు, ఆర్ ఆర్ బి బ్యాంకింగ్, పరీక్షల కు పోటీపడే నిరుపేదల కోసం ఉచితంగా శిక్ష ఆనందిస్తున్నది అన్నారు. నైపుణ్యం గల శిక్షకుల సహాయంతో నాణ్యమైన స్టడీ మెటీరియల్ సైతం అభ్యర్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ అధ్యాపకులు చెప్పే విషయాల పై పూర్తి పట్టు సాధించాలన్నారు. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించే అలవాటుతో పాటు తమ జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉన్నప్పుడే పోటీ పరీక్షల్లో రాణించగలుగుతారని ఏదైనా విషయాలలో సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. అన్ని పోటీ పరీక్షలకు కామన్ గా ఉండే జర్నల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ పై అభ్యర్థులు పట్టు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ ఎకనామి ,పోలిటి, మెంటల్ ఎబిలిటీ టి అంశాలను క్షుణ్ణంగా చదువాలని అభ్యర్థులకు సూచించారు. ఈ శిక్షణలో అభ్యర్థులు అన్ని రంగాలలో నైపుణ్యం సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆకారపు జగదీష్ , స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

# సూర్యాపేటలో ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు





సూర్యాపేట, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్):జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు చొరవ తీసుకొని యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం, జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొన్ని శాఖల్లో ఎక్కువ కాలంగా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణం పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో భూములకు సంబంధించి 41, ఎంపీడీవోలకు 13, మున్సిపల్ కమిషనర్లకు 8, ఇతర అధికారులకు 14 ఫిర్యాదులు వచ్చాయి. మొత్తం 76 ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని ఫిర్యాదులను జాగ్రత్తగా పరిశీలించి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో డీఆర్‌డీ ఓ పీడీ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీసీవో పద్మ, డీఈఓ అశోక్, డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, డీఎస్ఓ మోహన్ బాబు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయి గౌడ్, సంతోష్ కిరణ్, శ్రీనివాసరాజ్, శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చింతలకుంటలో బిసి యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర కమిటీ సమావేశం



చింతలకుంట, సెప్టెంబర్ 1: బిసి యునైటెడ్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం ఈ రోజు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఐతగోని రాఘవేంద్ర గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చీమలు శ్రీనివాస్, భూజగొనీ వెంకటరామయ్య, సెక్రటేరీగా వాసు కే. యాదవ్, జాయింట్ సెక్రటేరీలుగా సిలివేరి గాలయ్య, మారపంగు వెంకన్న, ట్రెజరర్‌గా విద్యారాణి గార్లను నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక ఎన్నికల్లో బిసి యునైటెడ్ ఫ్రంట్ జెండా ఎగరడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. బిసి సమాజం మొత్తం పార్టీ వెంటే ఉందని, ఎన్నికల్లో విజయదుదూ ఖాయం అవుతుందని తెలిపారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా – సిఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేత



సంగారెడ్డి, సెప్టెంబర్ 1 (సందేశం టైమ్స్): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని మర్వేల్లి గ్రామానికి చెందిన వడ్ల సంగన్నకు ఈ రోజు మాజీ సర్పంచ్ పట్లోళ్ల శివశరణ్ సిఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. రూ.60,000 విలువైన ఈ చెక్కును అందజేయడంతో అక్కడి ప్రజల్లో హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా శివశరణ్ మాట్లాడుతూ, "సిఎం ఆర్ఎఫ్ పేదల ఆరోగ్యానికి ఎంతో భరోసానిస్తుంది. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు చికిత్స పొందేందుకు ఈ నిధి సహాయపడుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బస్వరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హౌసింగ్‌లో 23 మంది ఏఈలకు పదోన్నతి




అమరావతి సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పని చేస్తున్న 23 మంది హౌసింగ్ ఏఈలకు ప్రభుత్వం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(డీఈఈ)గా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదోన్నతులు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికనే అమలవుతాయని, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై తుది తీర్పులను అనుసరించి ఎప్పుడైనా నోటీసులు ఇవ్వకుండా, కారణాలు చెప్పకుండానే తిరిగి ఏఈలుగా నియమిస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# రోడ్డు పనులు పూర్తిచేయాలి

## నిరసన తెలుపుతున్న విద్యార్థులు
## సిరుసువాడ గ్రామ విద్యార్థుల ఆందోళన



కొత్తూరు, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిరుసువాడకు చెందిన విద్యార్థు లు పోరుబాట పట్టారు. పనులు ఎప్పటికి పూర్తి చేస్తారంటూ నిరసన చేపట్టారు. సిరుసువాడ-కుంటిబద్ర రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఈ ఏడాది మార్చిలో పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, కాంట్రాక్టర్ సగం పనులు చేసి ఆపేశా డు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రహదారి బురదమయంగా మారింద ని, దీనివల్ల కుంటిబద్రలోని హైస్కూల్‌కు సైకిళ్లు, కాలినడకన వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ సిరుసువాడ విద్యార్థులు నిరసనకు దిగారు. కొన్నిచోట్ల రాళ్లు తేలటంతో కాళ్లకు గుచ్చుకుంటున్నాయని, సైకిళ్ల టైర్లకు పంక్చర్లు అవుతున్నాయని వాపోతున్నారు. సిరుసువాడ నుంచి ఇటు కొత్తూరు రావాలన్న ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, గ్రామస్థులు కోరుతున్నారు.

# పేకాట శిబిరాలపై దాడులు : 14 మంది అరెస్ట్



గోకవరం (తూర్పు గోదావరి) : సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): మండలంలో పలు చోట్ల పేకాట శిబిరాలపై దాడులు చేసి 14 మందిని అరెస్ట్ చేసినట్లు గోకవరం ఎస్సై వి.ఎన్.వి.పవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై పవన్ కుమార్ మాట్లాడుతూ ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా మండలంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ, కొత్తపల్లి గ్రామాల్లో పేకాట శిబిరాలుపై దాడులు చేసి 14 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.13,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైన పేకాట, గుండాట, కోడిపందాలు, బొమ్మబొరుసు లాంటి అసాంఘిక కార్యకలపాలకు పాల్పడిన, వాటిని నిర్వహించిన, వారిపై కేసులతో పాటు, షీట్లు కూడా తెరవడం జరుగుతుందని హెచ్చరించారు.

# సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి వస్తుండగా..




ఎచ్చెర్ల సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):ఎచ్చెర్ల సమీపం లో పాత జాతీయ రహదా రిపై సాయం త్రం జరిగిన రోడ్డు ప్రమా దంలో వీరఘట్టం మండలం గదబవలసకి చెందిన చిలక ల శేఖర్(25) తీవ్రంగా గా యపడి బ్రెయిన్‌డెడ్‌కు గుర య్యాడు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బీపీఈడీ పూర్తి చేసిన శేఖర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూని వర్సిటీలో సర్టిఫికేట్లు తీసుకుని మోటారు బైక్‌పై తిరిగి వెళ్తుండగా ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శేఖర్‌ను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్టు గుర్తించారు. కుటుంబ సభ్యులు అవయవ దానం చేసేందుకు ముందుకు రావడంతో క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉంచారు. బీపీఈడీ పూర్తిచేసి గుంటూరులో ఎంపీఈడీ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందు కు సిద్ధమైన శేఖర్‌కు ఇలా ప్రమాదానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు.

# ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి




%రామభద్రపురం, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో కిరాయి లేక తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు బలసా శ్రీను డిమాండ్ చేశారు. రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన జీవో -21ను రద్దుచేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన ప్రభుత్వ హామీ నెరవేర్చాలని కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 19న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ అజురఫీ జాన్‌కు వినతిపత్రం అందించా రు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు లోకేష్, వెంకటేష్, రామకృష్ణ, సోములు, మురళీ, రాజు, శ్రీను, అప్పారావు, లెంక మురళి పాల్గొన్నారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వృద్ధులకు, చిన్న పిల్లలకు సహాయం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెలమల ప్రసాదరావు పాల్గొన్నారు.

# సఖినేటిపల్లి రేవులో పంటు నిలిపివేత



సఖినేటిపల్లి (కోనసీమ) సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):గోదావరి వరద ఉధృతి కారణంగా సఖినేటిపల్లి రేవు నరసాపురంల మధ్య పంటు ప్రయాణం నిలిపివేశారు. దీనితో డా. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. వరద కారణంగా ఆగష్టు 21 నుండి 23వరకూ మూడురోజులు పంటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. వెంటవెంటనే వస్తున్న వరదలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రయాణికుల భద్రత దఅష్ట్యా ఈ నిర్ణయం తీసుకునట్లు అధికారులు తెలిపారు.

# కబ్జాదారులకు చెక్




సెప్టెంబర్1 (సందేశం టైమ్స్)::ఆనందపురం మండలం గండిగుండం గ్రామ రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల స్వాధీనానికి అధికారులు నడుంబిగించారు. ఈ ప్రాంతానికి చెందిన ఓ ప్రజా ప్రతినిధి, ఆయన కుటుంబం ఆధీనంలో ఉన్న భూముల వివరాలు సేకరించిన అధికారులు తొలుత సర్వే నంబర్ 212-1లో గల ఎకరా భూమిని స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఈ భూమి విలువ సుమారు ఐదారు కోట్ల రూపాయలు ఉంటుంది. చాలాకాలంగా సదరు ప్రజా ప్రతినిధి ఆధీనంలో ఉన్న ఎకరా భూమిలో సరుగుడు వేశారు. ఇటీవల తోటలు నరికేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయం గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేసిన వారికి తెలిసినప్పటికీ లంచాలు తీసుకుని చర్యలు తీసుకోకుండా వదిలేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గండిగుండంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో అధికారులు కదిలారు. సర్వే నంబర్ 212-1లో ఎకరా భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. కాగా ఆ ప్రాంతంలో సుమారు ఆరేడు ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉన్నట్టు అధికారులకు సమాచారం అందింది. ఒకే కుటుంబంలో మైనర్ల పేరిట గతంలో డీపట్టాలు తీసుకున్నారు. ఇంకా ఇనాం భూమి స్వాధీనం చేసుకుని సహకార సొసైటీ నుంచి రుణం తీసుకున్నట్టు అధికారులకు ఫిర్యాదులు అందాయి.

# సైక్లింగ్ ద్వారా శారీరక వ్యాయామం



జగ్గంపేట(కాకినాడ) సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): శారీరక వ్యాయామం కోసం సైక్లింగ్ చేయాలని ఎస్ఐ రఘునాథరావు సూచించారు. స్థానిక హైస్కూల్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ఆయన తన సిబ్బందితో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైక్లింగ్ అత్యంత ఉపయోగకరమన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు. ఇక నుంచి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై దృష్టి రోజున సైక్లింగ్ చేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ర్యాలీ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

# రేషన్ డిపోలకు స్మార్ట్ రైస్ కార్డులు

సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): ప్రభుత్వం కొత్తగా ముద్రించిన డిజిటల్ స్మార్ట్ రైస్ కార్డులు పూర్తిస్థాయిలో రేషన్ డిపోలకు చేరాయి. వాటిని డిపోల్లోనే డీలర్లు సోమవారం నుంచి కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు. సెప్టెంబరు 15వ తేదీ వరకు డిపోల్లో కార్డులు అందజేస్తారని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ తెలిపారు. అయితే ఆగస్టు మూడోవారంలోనే జిల్లాకు స్మార్ట్ రైస్‌కార్డులు చేరుకోగా, తొలుత సచివాలయాలకు అందజేశారు. ఆ తరువాత కొన్నింటిని డిపోల ద్వారా పంపిణీ చేశారు.ఇప్పటివరకు జిల్లాలో 5,17,155 కార్డులకుగాను 1,76,100 (34శాతం) కార్డులను సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు. వీటిలో సచివాలయాల ద్వారా 1,28,766, డిపోల నుంచి 47,334 పంపిణీ చేశారు. కార్డుల పంపిణీలో నాలుగు గ్రామీణ మండలాలు ముందుండగా నగరంలో వెనుకబడి ఉంది. ఇంకా మిగిలిన 3,41,055 కార్డులను డిపోలకు పంపించారు. కార్డుల పంపిణీపై ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల్లో మార్పులు చేయడంతో కొంత గందరగోళం నెలకొంది. సచివాలయాల్లో వీఆర్వోల ద్వారా కార్డుల పంపిణీ చేయాలని మొదట ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి కార్డుదారునికి కార్డుఇచ్చే ముందు అతని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని సూచించింది. అయితే కార్డుల పంపిణీని వీఆర్వోలు వ్యతిరేకిస్తూ వచ్చారు.

# విధి వంచితుడికి రోటరీ చేయూత



గుంటూరు(విద్య), సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో సీటు సంపాదించి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన మాజీ క్రీడాకారుడు ఇఫ్రాయం దత్తుబాబుకు రోటరీ క్లబ్ సభ్యులు వితరణ ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో వెన్నువిరిగి 16 ఏళ్లకే మంచానికి పరిమితమైన గుంటూరు హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇఫ్రాయం దత్తుబాబు దీనస్థితి గురించి ఇటీవల చూసి చలించిపోయామని సభ్యులు తెలిపారు. ఈ మేరకు దత్తు బాబు కుటుంబాన్ని ఆయన ఇంటి వద్ద కలిసి రూ.50,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ అధ్యక్షుడు కొండపనేని విజయకృష్ణ, కార్యదర్శి గోనుగుంట్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దత్తుబాబు తల్లి రూత్‌రాణి మాట్లాడుతూ కుమారుడికి ఇంకా రెండు పెద్ద సర్జరీలు జరగాల్సి ఉందని, సాయం చేసేవారు 9000980948 నంబరుకు ఫోన్‌పే/గూగుల్ పే చేయాలని కోరారు. బ్యాంకు ఖాతాలో జమ చేయాలనుకునేవారు 'దుగ్గిరాల ఇఫ్రాయం దత్తుబాబు, ఎస్‌బీఐ ఖాతా నంబరు 62487417417, ఐఎఫ్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0021263'కు పంపాలని విజ్ఞప్తి చేశారు.

# నాణ్యమైన ఉల్లిని తీసుకురండి



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): ప్రభుత్వం ప్రకటించిన ధరను అందుకునేందుకు రైతులు నాణ్యమైన ఉల్లిని కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకురావాలని జేసీ నవ్య పేర్కొన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో అమ్మకానికి తెచ్చిన ఉల్లి రైతులతో జేసీ మా ట్లాడారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు అవగాహ నతో పంటల సాగు చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో ఖర్చులు తగ్గించుకుని అధిక ఉ త్పత్తులు సాధించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం రానివ్వ మని భరోసా ఇచ్చారు. సోమవారం నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో నాణ్యమైన ఉల్లికి క్వింటానికి రూ. 1,200 చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా కొను గోలు చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, ఏడీఎం నారాయణమూర్తి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటే శ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్, అకౌంటెంట్లు కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

# అదృశ్యమైన హెడ్ కానిస్టేబుల్ మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్పీ కిశోర్
- ఎర్రకాలువలో మృతదేహం లభ్యం
- విధుల్లో ఉండగా ద్విచక్ర వాహనంతో గల్లంతు
- కుటుంబ సభ్యులకు ఎస్పీ పరామర్శ



జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): అదృశ్యమైన ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ మృతదేహం ఎర్ర కాలువలో ఆదివారం లభ్యమైంది. ఆగస్టు 29న రాత్రి నుంచి కనిపించకుండా పోయిన ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ బుడుపుల సుబ్బారావు (55) మృతి చెందారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం సమీపంలో ఎర్రకాలువలో ఆయన లభ్యమైంది. డీఎస్పీ యు.రవిచంద్ర తెలి పిన వివరాల ప్రకారం కామవరపుకోట, టి.నరసాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో సుబ్బారావు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం బుట్టాయగూడెం నుంచి ప్రతీరోజు విధులకు హాజరవడం ఇబ్బందిగా ఉందని కామవరపుకోటలోనే గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. 29న రాత్రి విధుల్లో భాగం గా టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం నుంచి అప్పలరాజుగూడెం రహదారిలో చప్టాపై నుంచి ఉ ధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువలో ప్రమాదవశాత్తు సుబ్బారావు తన ద్విచక్ర వాహనంతో పాటు గల్లంతయ్యాడని డీఎస్పీ తెలిపారు. వరద ఉధృతిని అంచనా వేయలేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు. సుబ్బారావు ఫోన్ పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆయన కుమారుడు జాన్ రాజు తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుబ్బారావు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆధునిక సాంకేతికను ఉ పయోగించి జంగారెడ్డిగూడెం, పోలవరం డీఎస్పీలు రవిచంద్ర, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నుంచి ఎర్రకాలువలో ఫైర్, ఫిషరీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు, డ్రోన్ కెమేరాలతో గాలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం వద్ద సుబ్బారావు ద్విచక్ర వాహనం లభ్యమైంది. ఆదివారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా గల్లంతయ్యాడని భావిస్తున్న ప్రదేశానికి మూడు కిలో మీటర్ల దూరంలో కాలువలో మృత దేహం లభ్యమైంది. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో పో స్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సుబ్బారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# రూ.14 లక్షల డిఎపి సీజ్



ప్రత్తిపాడు సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): మండలంలోని వంగిపురంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక వ్యవసాయాధికారులు తనిఖీలు చేశారు. ఈ-పాస్ మిషన్లో నిల్వలతో భౌతిక నిల్వలను సరిపోలచడంతో వ్యత్యాసం వచ్చిన ఎరువుల విక్రయాలను నిలిపేస్తూ ఆదేశాలిచ్చారు. స్థానిక సుబ్బలక్ష్మి ఫెస్టిసైడ్‌లో 200 బస్తాల డిఎపి, 180 బస్తాల 20:20 ఎరువుల విక్రయాలను నిలిపేశారు. వీటి విలువ రూ.4.80 లక్షలుగా పేర్కొన్నారు. శ్రీనివాస ఏజెన్సీస్ దుకాణంలో రూ.9.24 లక్షల విలువ చేసే 700 బస్తాల డిఎపి, మొత్తంగా 14 లక్షల ఎరువులను విక్రయించకుండా ఆదేశాలిచ్చారు. తనిఖీల్లో జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మ్‌టం ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ వ్యవసాయ అధికారి సి.హెచ్. ఆదినారాయణ, మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం పాల్గొన్నారు.

# ఖాళీలపై కసరత్తు



**ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అవ్వాల్సిన మాచర్ల మండలంలోని ఓ పాఠశాల**

గుంటూరు : సెప్టెంబర్1 (సందేశం టైమ్స్)::ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీలో ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. ఎంపికైన అభ్యర్థులకు సెప్టెంబర్‌లో నియామక పత్రాలివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఖాళీలపై పడింది. 2025 ఆగస్టు వరకూ ఉన్న ఉపాధ్యాయుల రిటైర్మెంట్లను దృష్టిలో పెట్టుకుని పోస్టులు గుర్తించి, అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. దీంతో ఖాళీలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు అభ్యర్థులు తమ వచ్చిన ర్యాంక్‌తో ఎక్కడ పోస్టింగ్ వస్తుంది, ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయని ఆరా తీస్తున్నారు. కొందరు మెరిట్ సాధించినా దూర ప్రాంతాల్లో పోస్టింగ్ వస్తుందనే ఆందోళనలో ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్‌తోపాటు, జోనల్ స్థాయి పోస్టులైన గురుకులాలతో కలిపి తదితర మేనేజ్‌మెంట్లలో 1650 పోస్టులను ప్రకటించింది. ఇందులో జిల్లా స్థాయి పోస్టులు 1143 ఉన్నాయి. కాగా పల్నాడు జిల్లాలోని కొన్ని మండలాల్లో పెద్ద ఎత్తున ఖాళీలున్నాయి. ఈ సంఖ్య సుమారు 250కు ఉంది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా డీఎస్సీ ఖాళీలను కూడా చూపటంతో దూరప్రాంత మండలాలను ఉపాధ్యాయులు కోరుకోలేదు. దీంతో పల్నాడులో అనేక ప్రాంతాల్లో ఖాళీలు పెద్ద సంఖ్యలో ఏర్పడ్డాయి. పల్నాడు నుండి ఇతర ప్రాంతాలకు బదిలీ కోరుకున్న వారి స్థానంలో రిలీవర్లు లేకపోవటంతో బదిలీ ఉపాధ్యాయుల్ని అక్కడే ఉ ంచారు. ఖాళీలు భర్తీక విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటినా ఉపాధ్యాయుల్లేక బోధన కుంటుపడుతోంది. ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థులతో ఆయా ఖాళీలు భర్తీ చేయాలని భావిస్తున్నారు. విద్యాశాఖ ఉ న్నతాధికారుల నుండి పట్టణాలు, వాటికి దగ్గరగా ఉండే హెచ్‌ఆర్‌ఎ కేటగిరీ 1, 2లలోని పోస్టులను కాకుండా, 3, 4 కేటగిరీల్లోని ఖాళీల భర్తీకి ప్రాధాన్యమివ్వాలని ఆదేశాలు అందినట్లు సమాచారం. స్కూల్ అసిస్టెంట్ సోషల్‌కు సంబంధించి బొల్లాపల్లి, వెల్దుర్తి, నూజెండ్ల, గురజాల, మాచర్ల, కారంపూడి, వినుకొండ, క్రోసూరు, అచ్చంపేట, రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోనే భర్తీ చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

# ఉధృతంగానే జలాశయాలు



విజయపురిసౌత్ సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): ఎగువ నుండి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఈ క్రమంలో సాగర్‌లో 26 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 22 గేట్లను 5 అడుగుల వరకు, 4 గేట్లను 10 అడుగుల వరకు ఎత్తి 2,89,388 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 3,05063 క్యూసెక్కులు వచ్చి చేరడంతో ఈ మొత్తం నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 9019 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 32642 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసికి 1200 క్యూసెక్కులు, వరద కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 586.70 అడుగుల వద్ద ఉంది. 303.9495 టీఎంసీలకు సమాన. పులిచింతలకు 2,32,037 క్యూసెక్కులు సత్రశాలలోనే కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 గేట్లకుగాను 9 గేట్లను 3 మీటర్ల వరకు, 8 గేట్లను 2.5 మీటర్ల వరకు ఎత్తి పులిచింతలకు 2,32,037 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఇ వెంకటరమణ తెలిపారు.

# నోటీసులిచ్చిన దివ్యాంగులకు పింఛన్లు

విశాఖపట్నం, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):వైద్య పరీక్షల్లో అనర్హులుగా తేలిన దివ్యాంగులకు గత నెల పింఛన్లు నిలిపివేశారు. అయితే వారిలో చాలామంది తాము అర్హులమంటూ అధికారులకు విన్నవించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం గ్రీవెన్స్‌లో వినతులిచ్చిన వారందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో సుమారు 1200 మందికి సోమవారం నుంచి పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నారు. వైద్య పరీక్షల్లో 40 శాతం కంటే తక్కువ అంగవైకల్యం ఉన్నట్టు నిర్ధారించిన మేరకు జిల్లాలో 1,558 మంది పింఛన్లను గత నెల నిలిపివేశారు. జిల్లాలో రూ.6 వేల చొప్పున పింఛను తీసుకుంటున్న 21,306 మంది దివ్యాంగుల అంగవైకల్యంపై ఈ ఏడాది జనవరి నుంచి కేటగిరీల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించారు. నిబంధనల మేరకు 40 శాతం అంగవైకల్యం ఉ ంటేనే పింఛన్‌కు అర్హులని నిర్ధారించారు. కానీ పరీక్షలలో 1,558 మంది 40 శాతం కంటే తక్కువగా అంగవైకల్యం ఉ న్నట్టు ధ్రువీకరించారు. దీంతో వారికి గత నెల పింఛన్ నిలిపివేశారు. దీనిపై కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు అందజేయడంతో ప్రభుత్వం స్పందించింది. పింఛన్ నిలిపివేతపై గ్రీవెన్స్ పెట్టుకోవాలని సూచించింది. దీంతో జిల్లాలో ఆదివారం సాయంత్రం వరకు సుమారు 1,200 మంది ఎంపీడీవోలు/ జోనల్ కమిషనర్లకు, కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేశారు. వీరికి సోమవారం నుంచి పింఛన్లు అందజేస్తారు. మిగిలిన దివ్యాంగులు కూడా వెంటనే గ్రీవెన్స్ పెట్టుకోవాలని అధికారులు సూచించారు. ఇదిలా వుండగా ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలో 1,60,429 మందికి రూ.70.05 కోట్లు పింఛన్ సొమ్ము విడుదలైంది.

# పంటలపై మళ్లీ 'గజ'దాడులు



కల్లూరు సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు మళ్లీ మొదలయ్యాయి. కొన్ని నెలలుగా పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు ఆగస్టు 17వ తేదీన తిరుపతి జిల్లా పాకాల మండలంలోకి వెళ్లిపోవడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మూడ్రోజులపాటు పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీ పరిధిలో తిష్ఠ వేసిన ఏనుగుల గుంపు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిని దాటుకుని పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని ఐరాల సెక్షన్‌లోకి వెళ్లిపోయాయి. మామిడికాయల సీజన్ కూడా పూర్తవడంతో ఏనుగుల గుంపు తిరిగిరాకుండా అటు నుంచి అటే వెళ్లిపోతాయని ప్రజలు భావించారు. అయితే రాత్రి ఉ న్నట్టుండి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి రాత్రి బయల్దేరిన 13 ఏనుగుల గుంపు కల్లూరులోని ఖాదర్‌బాషాకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడినుంచి పాతపేట వద్దకెళ్లి గ్రామంలోని రామ్మూర్తికి చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. సమీపంలో ఉన్న కల్లూరులోని సాధిక్, నవాబ్‌కు చెందిన మామిడి, కొబ్బరిచెట్లను విరిచేశాయి.

# హైదరాబాద్ వాసులకు బిగ్ అలర్ట్..

## ఆ ఏరియాల్లో తాగునీటి సరఫరాకు బ్రేక్




హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): నగరంలోని పలు ప్రాంతాలకు సోమవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఫేజ్ 3 పంపింగ్ మెయిన్‌కు సంబంధించి 1400 ఎంఎం డయా పైప్‌లైన్‌పైన, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో నీటి లీకేజీలను అరికట్టడానికి, అత్తాపూర్ మూసీ వంతెన వద్ద 300 ఎంఎం డయా వాల్వ్ ఎక్స్‌టెన్షన్, లీకేజీ మరమ్మతులు, మైలార్‌దేవ్‌పల్లి పంప్ హౌజ్‌లో పనిచేయని వాల్వ్‌లను మార్చేందుకు అధికారులు సోమవారం పనులు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో షేక్‌పేట్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ప్రశాశన్‌నగర్, తట్టిఖానా, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్పసొసైటీ, కావూరిహిల్స్ పరిసర ప్రాంతాల్లో నీటిసరఫరా ఉండదని వాటర్ వర్క్స్ అధికారులు తెలిపారు.

# బీ ఏ హీరో.. అడాప్ట్ పప్పీ నినాదంతో

## జాతీయ కుక్కల దత్తత మేళా

**బీ ఏ హీరో.. అడాప్ట్ పప్పీ**

**కొనసాగుతున్న కుక్కపిల్లల దత్తత మేళా**

**కుక్కపిల్లను దత్తత ఇస్తున్న కమిషనర్ కర్ణన్**




హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో దేశీ కుక్క పిల్లలు (ఇండ్ చెప్పీ మేళా) దత్తత కార్యక్రమం కొనసాగుతోంది. బీఏ హీరో, ఆడాపై. వోంట్ షాప్' నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ లోని కేబీఆర్ పార్కు వద్ద కమిషనర్ ఆర్వి కర్ణన్ ప్రారంభించారు.వ్యాపీ, నేషన్ చేసి పూర్తి ఆరోగ్యంగా ఉన్న 35 పప్పీలను ప్రదర్శనకు ఉంచగా.. 22 దేశీ పిల్లలను ఆసక్తి ఉన్న వారు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దేశీ కుక్కల ప్రత్యేక విశేషాలను వివరించారు. అన్ని జోన్లు, సర్కిళ్లలో దశల వారీగా దత్తత కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు.

# తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఏమైందంటే..




సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):రోడ్డు ప్రమాదాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో అవగాహన కల్పిస్తున్నాయి. అయినా వాహనదారులు తీవ్ర నిర్లక్ష్యంతో వాహనాలను నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు. గమ్యస్థానాలకు చేరుకోవాలనే తొందరలో అతివేగంతో వాహనాలను నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకుంటున్నాయి. కుటుంబ సభ్యులను రోడ్డు ప్రమాదాల్లో కోల్పోయిన కుటుంబాలు తీవ్ర శోకంలో మునిగిపోతున్నాయి.తాజాగా మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కాటారం స్టేజ్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు వెళ్తున్న బీసీవీఆర్ ట్రావెల్స్ బస్సు కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సులో నుంచి ఎగిరిపడి ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన విషయాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు.

# నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

నిమ్స్, సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):: పుట్టుకతోనే గుండె సంబంధ వ్యాధులతో బాధపడుతున్న చిన్న పిల్లలకు బ్రిటన్ వైద్యులచే నిమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 21 వరకు నిర్వహించే ఈ శిబిరంలో చిన్నారులను పరీక్షిస్తారు. వ్యాధి నిర్ధారణ అనంతరం అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారు. ఈ చికిత్సలకు అయ్యే ఖర్చును ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది.నిమ్స్ పాత భవనం తొలి అంతస్తు సీటీవీఎస్ కార్యాలయంలో డా. అమరేష్ రావు, డా. ప్రవీణ్, డా. గోపాల్‌లను మంగళ, గురు, శుక్రవారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిన్నారుల తల్లిదండ్రులు సంప్రదించవచ్చని, పేషెంట్ల వారి పూర్వపు రిపోర్టులు, సీటీస్కాన్ రిపోర్టులు వారి వెంట తీసుకురావాలని బీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.

# జీహెచ్ఎంసీ న్యూ టెక్నాలజీ..

## ఇక రహదారులకు డిజిటల్ ఐడీ




**ఇక రోడ్ల డిజిటలైజేషన్**

**చేయని పనుల బిల్లుల చెల్లింపునకు చెక్**

**మొబైల్ యాప్ ద్వారా సమగ్ర సమాచారం**

**అక్రమాలకు చెక్ పెట్టేలా జీహెచ్ఎంసీ నిర్ణయం**

**ప్రజాధనం వృథాను కాపాడేలా కార్యాచరణ**

%హైదరాబాద్ సెప్టెంబర్1 (సందేశం టైమ్స్):రహదారులు నిర్మించకుండానే పనులు చేసినట్టు, గుంతలు పూడ్చకుండానే మరమ్మతు పూర్తయినట్టు బల్దియా ఖజానాను కొల్లగొడుతున్న అక్రమార్కులకు చెక్‌పెట్టేలా జీహెచ్ఎంసీకీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న రహదారుల సమాచారాన్ని ఇక డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది.స్ట్రెచ్‌ల వారీగా ప్రతి రోడ్డుకు ప్రత్యేక యూనిక్ ఐడీ కేటాయించి, అక్కడ జరిగే పనుల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా సాంకేతిక చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్ రూపకల్పనకు బల్దియా కసరత్తు చేస్తోంది. పలు ఏజెన్సీలతో ఇప్పటికే ఐటీ విభాగం అధికారులు సంప్రదింపులు జరిపారు. త్వరలో ఏజెన్సీ ఎంపిక జరుగనుంది. క్షేత్రస్థాయిలో పర్యటించే ఏజెన్సీ సిబ్బంది.. రహదారుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఓ అధికారి తెలిపారు.గ్రేటర్‌లో 9103 కిలోమీటర్ల మేర బీటీ, సీసీ రహదారులున్నాయి. ఇందులో ప్రభుత్వ విభాగం రోడ్లు ఎన్ని ఉన్నాయి.? వాటిలో ప్రధాన, అంతర్గత రోడ్లు ఏవి.? అన్నది క్షేత్రస్థాయిలో సర్వే చేసి గుర్తించనున్నారు. ప్రస్తుతం నగరంలో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)లోని ఆర్అండ్ బీ, టీజీఐఐసీ, జీహెచ్ఎంసీ రోడ్లున్నాయి. ఎక్కడ రోడ్డు పాడైనా.. జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు వస్తున్నాయి. నిర్వహణలో వైఫల్యమవుతోందన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో విభాగాలు, లేన్ల వారీగా రహదారుల డేటాను యాప్‌లో నమోదు చేస్తారు. అనంతరం అక్కడి అధికారుల నంబర్లను డేటాకు అనుసంధానం చేయనున్నారు. స్ట్రెచ్ పై క్లిక్ చేస్తే అది ఏ విభాగానికి చెందిన రహదారి..? సంబంధిత అధికారి ఎవరు..? రోడ్డును ఎప్పుడు నిర్మించారు..? ఏ ఏజెన్సీ పనులు చేపట్టింది..? డీఎల్పీ ఎన్ని రోజుల వరకు ఉంది..? తదితర వివరాలూ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని ఐటీ విభాగం అధికారొకరు తెలిపారు. డిజిటైజేషన్ ద్వారా రహదారుల పక్కా సమాచారం అందుబాటులో ఉండటంతోపాటు.. అక్రమాలను నియంత్రించే అవకాశం ఉంటుందని జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి.

# యూరియా కోసం అవే కష్టాలు



కోనరావుపేటలో రైతుల సెప్టెంబర్1 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. పంపిణీ కేంద్రాలు, దుకాణాల ముందు రైతులు బారులు తీరి పడిగాపులు పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఒక దశలో తోపులాట జరిగింది. దాంతో పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. వికారాబాద్ జిల్లా దోమలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం నిర్వాహకులు టోకెన్లు ఇచ్చి అందరికీ యూరియా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు నిర్వాహకులు యత్నిస్తున్నారని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ పీఏసీఎసకు వచ్చిన రైతుల పట్టా, ఆధార్ జిరాక్స్ ప్రతులను వ్యవసాయ శాఖ సిబ్బంది విసిరేశారు. దీనిపై అధికారులను వివరణ కోరగా.. రైతులు ఎగబడడంతో కాగితాలు టేబుల్‌పై నుంచి కిందపడిపోయాయన్నారు.గత వారం రోజులుగా ఎదురుచూస్తున్న నర్సింహులపేట రైతులకు ఎట్టకేలకు వ్యవసాయ అధికారులు పోలీసుల సమక్షంలో కూపన్లు పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మంది రైతు వేదిక వద్దకు రాగా 770 మందికి మాత్రమే కూపన్లు ఇవ్వడంతో మిగిలిన రైతులు నిరాశతో వెనుతిరిగారు. జనగామ జిల్లా పాలకుర్తిలో రైతు సేవా సహకార పరపతి సంఘం వద్దకు తెల్లవారుజాము నుంచే రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 500 మందికి పైగా రైతు లు క్యూలైన్‌లోనే గంటల తరబడి నిలబడ్డారు. హైదరాబాద్ నుంచి 444 యూరియా బస్తాలు రాగా, వాటిని పోలీసుల సమక్షంలో ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు నిరాశతో వెళ్లిపోయారు. సరిపడా యూరియా ఇవ్వాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో రైతులు రహదారిపై బైఠాయించారు.

# బ్యాంకు బంగారం తాకట్టు పెట్టి క్రికెట్ బెట్టింగ్

**ఏకంగా 25 కిలోల పసిడి తాకట్టు**

**మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ మేనేజర్, క్యాషియర్ నిర్వాకం**

**నిందితుల వద్ద నుంచి 15 కిలోల బంగారం, రూ. 1.61లక్షలు స్వాధీనం**


**సూత్రధారితోపాటు 44 మంది అరెస్టు**



సెప్టెంబర్1 (సందేశం టైమ్స్)::బ్యాంక్‌లో పనిచేస్తున్న ఉద్యోగులే బ్యాంకుకు కన్నం వేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఖాతాదారులు తమ అవసరాల కోసం బ్యాంకులో తాకట్టు పెట్టిన 25కిలోల బంగారాన్ని కొల్లగొట్టారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులు సాధారణ ఉద్యోగులు కాదు.. చోరీ చేసిన వారిలో బ్యాంకు మేనేజర్‌తో పాటు క్యాషియర్ ఉన్నారు. బ్యాంకులో బంగారాన్ని కాజేసి ప్రైవే టు గోల్డ్‌లోన్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని, ఈ సొమ్ముతో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడ్డారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐలో చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎస్‌బీఐ-2 లో నరిగె రవీందర్ క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అయితే రవీందర్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలోనే భారీ మొత్తంలో బెట్టింగ్‌లకు పాల్పడి రూ. 40లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి ఖాతాదారుల బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎన్నపురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీపతో కలిసి పథకం రచించాడు. బ్యాంకులోని బంగారాన్ని బయటకు తీసి ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ సంస్థలో పనిచేసే కొంగొండి ధీరజ్, కోదాటి రాజశేఖర్, బొల్లి కిషన్ అనే వ్యక్తులకు ఇచ్చేవాడు. ఈ విధంగా గతేడాది అక్టోబర్ నుంచి బ్యాంకులో 402 మంది పేరిట ఉన్న గోల్డ్ లోన్ ఖాతాల నుంచి 25.17కిలోల బంగారాన్ని బయటకు తీసి పలు ప్రైవేట్ గోల్డ్ లోన్ కంపెనీల్లో తాకట్టు పెట్టారు. వచ్చిన సొమ్మును మొదట ధీరజ్, రాజశేఖర్, కిషన్ అకౌంట్లలో జమ చేసుకునేవారు. అనంతరం కమీషన్ తీసుకుని మిగతా సొమ్మును రవీందర్ ఖాతాకు బదిలీ చేసేవారు. ఈ డబ్బును ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో పెట్టేవాడు. ఇతడు బెట్టింగ్ పెట్టిన సొమ్మంతా విదేశాలకు మళ్లినట్లు పోలీసులు గుర్తించారు.బ్యాంకు ఆడిటింగ్ అధికారులు ఖాతాలను తనిఖీ చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. దీంతో బ్యాంకు రీజినల్ మేనేజర్ చెన్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో రవీందర్ అకౌంట్‌లో అనుమానాస్పద లావాదేవీలను గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. క్యాషియర్ రవీందర్, బ్యాంకు మేనేజర్ మనోహర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సందీపతోపాటు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు చెందిన ఉద్యోగులు, మేనేజర్లు, బినామీ పేర్లతో చోరీ బంగారాన్ని తాకట్టు పెట్టిన మొత్తం 47మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి 15.23కిలోల బంగారం, రూ 1.61లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు.



# క్రీడావార్తలు



## ఇంకెన్ని రోజులు వెయిట్ చేయాలి.. రిషభ్ పంత్ గాయంపై లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే..



ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ పాదానికి గాయం అయిన సంగతి తెలిసిందే. గాయంతోనే బ్యాటింగ్‌కు దిగి అర్ధశతకం సాధించాడు. అనంతరం టెస్ట్ సిరీస్ నుంచి వైదొలిగాడు. అప్పట్నుంచి ఇంటికే పరిమితమయ్యాడు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతున్న ఆసియా కప్‌లో కూడా పంత్ ఆడడం లేదు. విండీస్‌తో టెస్ట్ సిరీస్‌లో కూడా పంత్ ఆడేది అనుమానంగానే మారింది అక్టోబర్‌లో ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా పర్యటన సమయానికి మాత్రం పంత్ రెడీ అయ్యే అవకాశాలు కనబడుతున్నాయి . సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే పంత్ తరచుగా పలు ఫొటోలను, వీడియోలను పోస్ట్ చేస్తున్నాడు. అలాగే జిమ్‌లో వర్కౌట్లు కూడా చేస్తున్నాడు. తాజాగా తన కాలికి పట్టీ వేసుకుని జిమ్‌లో ఉన్న ఫొటోను షేర్ చేసిన పంత్.. 'ఇంకా ఎన్ని రోజులు' అని కామెంట్ చేశాడు. ఈ పోస్ట్‌పై అభిమానులు భారీగా రియాక్ట్ అవుతున్నారు %పంత్ గాయాన్ని అంచనా వేసిన వైద్యులు కనీసం ఆరు వారాల విశ్రాంతి అవసరం అని సూచించారు. ఇప్పటికి నాలుగు వారాలు పూర్తయింది. మరో 20 రోజుల అనంతరం బీసీసీఐ వైద్యులు పంత్ గాయాన్ని పరీక్షిస్తారు. గాయం నయమైందని భావిస్తే పంత్ చేత ప్రాక్టీస్ చేయిస్తారు. లేదంటే పంత్ మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.

## సూపర్ 4కు భారత్



రాజ్‌గిర్ (బిహార్): కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్‌తో అదరగొట్టడంతో.. ఆసియాకప్ హాకీలో భారత జట్టు వరుసగా రెండో విజయంతో సూపర్-4 బెర్తును ఖరారు చేసుకొంది. పూల్-ఎలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో జపాన్‌ను ఓడించింది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ (5వ, 46వ నిమిషం) రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచాడు. 4వ నిమిషంలో మన్‌దీప్ ఫీల్డ్ గోల్‌తో భారత్‌కు తొలి గోల్ అందించాడు. జపాన్ తరఫున కోసి కవాబే (38వ, 58వ) రెండు గోల్స్ సాధించాడు. తొలి మ్యాచ్‌లో చైనాపై గెలిచిన భారత్ మొత్తం ఆరు పాయింట్లతో పూల్-ఎలో అగ్రస్థానంలో నిలిచింది. సోమవారం లీగ్ ఆఖరి మ్యాచ్‌లో కజకిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఇక, సూపర్-4లో స్థానం కోసం జపాన్, చైనా అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇదే గ్రూప్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో చైనా 13-1తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది.

## జ్వెరెవ్ అవుట్ ప్రీక్వార్టర్స్‌కు సినర్, స్వియాటెక్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన ఉత్కంఠ పోరులో జ్వెరెవ్ (జర్మనీ) 6-4, 6-7 (7/9), 4-6, 4-6తో 25వ సీడ్ ఫిలిక్స్ అలియసిమ్ (కెనడా) చేతిలో ఓడాడు. 2018 తర్వాత జ్వెరెవ్ నాలుగో రౌండ్‌కు చేరకపోవడం ఇదే తొలిసారి. ఇక ఆదివారం తెల్లవారుజామున ముగిసిన మూడో రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్ 5-7, 6-4, 6-3, 6-3తో షపోవలోవ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్ చేరాడు. మరో మ్యాచ్‌లో రుబ్లెవ్ 2-6, 6-4, 6-3, 4-6, 6-3తో కొలెమాన్ వాంగ్‌పై పోరాడి గెలిచాడు. మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో రెండో సీడ్ స్వియాటెక్ 7-6, 6-4తో అన్నా కలిన్స్కయపై, నాలుగో సీడ్ జెస్సికా పెగుల 6-1, 6-1తో ఆన్ లీపై, 8వ సీడ్ ఎనిమిసోవా 6-4, 4-6, 6-2తో క్రిస్టియాన్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు.రెండో రౌండ్‌లో యుకీ జోడీ: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. తొలిరౌండ్లో రోహన్ బోపన్న/అర్నెడో జంట ఓడగా.. యుకీ భాంబ్రి/మైకేల్ వీనస్ జంట ప్రత్యర్థిని ఓడించింది.

## తలైవాస్‌పై యు ముంబా గెలుపు



: ప్రొ కబడ్డీ లీగ్‌లో తమిళ్ తలైవాస్‌కు యు ముంబా ఝలక్ ఇచ్చింది. ఆదివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో యు ముంబా 36-33తో తమిళ్ తలైవాస్‌పై నెగ్గింది. తలైవాస్ రైడర్లు అర్జున్ దేశ్‌వాల్, కెప్టెన్ పవన్ సెహ్రావత్ 17 పాయింట్లు రాబట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 54-44తో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. ఇక, సోమవారం జరిగే పోటీలో పట్నా పైరేట్స్‌తో యూపీ యోధాస్, గుజరాత్ జెయింట్స్‌తో పుణెరి పల్టన్ జట్లు తలపడనున్నాయి.

## మరో కాంస్యంతో మెరిసిన సాత్విక్, చిరాగ్ జోడీ




పారిస్: నిరుడు పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి క్వార్టర్‌ఫైనల్లోనే పరాజయం పాలై నిరాశగా వెనుదిరిగింది. సరిగ్గా ఏడాది తిరిగే సరికి.. అదే వేదిక.. కానీ టోర్నీ ప్రపంచ చాంపియన్‌షిప్.. ఈసారి ఫలితం కూడా మారింది. విశ్వక్రీడల్లో పతకం దూరమైనా, ప్రపంచ టోర్నీలో కాంస్యం సాధించి సాత్విక్, చిరాగ్ జంట అబ్బురపరిచింది. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జోడీ సాత్విక్/చిరాగ్ 19-21, 21-18, 12-21తో ప్రపంచ 11వ ర్యాంకరైన చైనా జంట చెన్ బో యాంగ్/లియు యి చేతిలో పోరాడి ఓడింది. సెమీస్ ఓటమితో సాత్విక్ ద్వయం కంచు పతకానికే పరిమితమైనా.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండోసారి పతకం నెగ్గి అ'ద్వితీయ'ం అనిపించుకుంది. ఈ మెగా టోర్నీలో రెండు పతకాలు సాధించిన భారత డబుల్స్ జోడీగా సరికొత్త చరిత్ర సృష్టించింది. 2022 టోక్యోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సాత్విక్/చిరాగ్ జంట కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే.%షి యుకి, యమగూచిలకు సింగిల్స్ టైటిళ్లు: ప్రపంచ చాంపియన్‌షిప్ సింగిల్స్ టైటిళ్లను షి యుకి (చైనా), అకానె యమగూచి (జపాన్) దక్కించుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో షి యుకి 19-21, 21-10, 21-18తో కున్లావత్ వితిసార్న్ (థాయ్‌లాండ్)పై గెలిచి విజేతగా నిలిచాడు. ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), విక్టర్ లాయ్ (కెనడా) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో యమగూచి 21-9, 21-13తో చైనా స్టార్ చెన్ యుఫీని చిత్తుచేసి స్వర్ణం అందుకుంది. అన్ సే యంగ్ (కొరియా), క్వార్టర్స్‌లో సింధును ఓడించిన పుత్రి కుసుమ వర్ధని (ఇండోనేసియా) కాంస్య పతకాలు సాధించారు. కొరియా జంట సియో సంగ్ జే/కిమ్ వోన్ హొ 21-17, 21-12తో చైనా జోడీ చెన్ బో యాంగ్/లియు యికి షాకిచ్చి పురుషుల డబుల్స్ చాంపియన్‌గా నిలిచింది.ఇప్పటిదాకా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు సాధించిన పతకాలు. మహిళల సింగిల్స్‌లో సింధు (ఓ స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు), సైనా నెహ్వాల్ (ఓ రజతం, ఓ కాంస్యం), మహిళల డబుల్స్‌లో జ్వాల/అశ్విని (కాంస్యం), పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ (రజతం), ప్రకాశ్ పదుకోన్ (కాంస్యం), సాయి ప్రణీత్ (కాంస్యం), ప్రణయ్ (కాంస్యం), లక్ష్య సేన్ (కాంస్యం), పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ (రెండు కాంస్యాలు) పతకాలు గెలిచారు.

## ఆర్చర్ చికితకు టీఏఏ సన్మానం




: ఇటీవల ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన కరీంనగర్ జిల్లా ఆర్చర్ చికితా రావు వచ్చే ఒలింపిక్స్‌లోనూ పతకం సాధిస్తుందన్న విశ్వాసముందని తెలంగాణ ఆర్చరీ సంఘం (టీఏఏ) అధ్యక్షులు టి. రాజు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో చికితను టీఏఏ తరఫున రాజు సన్మానించారు.

## సెమీస్‌లో నార్త్ సెంట్రల్ జోన్లు



బెంగళూరు: దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు తమ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా సెమీస్‌లో ప్రవేశించాయి. ఆదివారం ఈస్ట్ జోన్‌తో ముగిసిన క్వార్టర్స్‌ను నార్త్ జోన్ డ్రాగా ముగించింది. మూడో రోజే 563 పరుగుల భారీ ఆధిక్యం దక్కించుకున్నప్పటికీ నార్త్ తమ ఆటను కొనసాగించింది. ఈక్రమంలో ఆయుష్ బదోని (204) డబుల్ సెంచరీ సాధించగా, కెప్టెన్ అంకిత్ (198) తృటిలో ఈ ఫీట్ మిస్సయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 658/4 స్కోరు వద్ద నార్త్ జోన్‌డిక్లేర్ చేయడంతో ఇరుజట్లు డ్రాకు అంగీకరించాయి. దీంతో తొలి ఇన్నింగ్స్ 833 పరుగుల ఆధిక్యంతో నార్త్ సెమీస్ చేరింది. ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 రన్స్ చేసింది. సెంట్రల్ జోన్-నార్త్ ఈస్ట్ జోన్ మధ్య క్వార్ట ర్స్ కూడా డ్రాగా ముగిసింది. అయితే 478 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో సెంట్రల్ జోన్ సెమీస్‌లో అడుగుపెట్టింది.

## నీ బ్యాటింగ్ టెస్ట్ క్రికెట్‌కు అందం



న్యూఢిల్లీ: టెస్ట్ క్రికెట్ సొగసు చటేశ్వర్ పుజారా బ్యాటింగ్‌తో మరింత గుభాళించిందని ప్రధాని మోదీ కొనియాడారు. అతడి బ్యాటింగ్ శైలి సుదీర్ఘ ఫార్మాట్ అందానికి అద్దం పడుతుందని ప్రశంసించారు. ఇటీవల టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సౌరాష్ట్ర ఆటగాడికి ప్రధాని లేఖ రాశారు. 'పొట్టి క్రికెట్ ఆధిపత్యం చెలాయిస్తున్న కాలంలో..సుదీర్ఘ ఫార్మాట్ ఆట అందం ఎలా ఉ ంటుందో చెప్పేందుకు నువ్వే తార్కాణం. మెన్ను చూపని నీ తత్వం, గొప్ప సంకల్పంతో గంటలకొద్దీ బ్యాటింగ్ చేయగల సామర్థ్యంతో భారత బ్యాటింగ్‌కు అండగా నిలిచావు' అని ఆ లేఖలో ప్రధాని పొగిడారు. ఈమేరకు మోదీ పంపిన లేఖను పుజారా ఆదివారంనాడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు.

# బిజినెస్



## పసిడికి రెక్కలు..



భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ గరిష్టం వద్ద ట్రేడ్ అవుతున్నాయి . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (సెప్టెంబర్1న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 04, 940కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 96, 190కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 05, 090కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 96, 340కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 04, 940కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 96, 190కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## ఈ ఏడాది ప్రైవేట్ పెట్టుబడుల జోరు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు (క్యాపెక్స్) పుంజుకునే ఆస్కారం కనిపిస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ పెట్టుబడులు 21.5% వృద్ధితో రూ.2,67,432 కోట్ల స్థాయిలో ఉండొచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ పెట్టుబడులు రూ.2,20,132 కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయ అస్థిరతలు వెన్నాడుతున్నప్పటికీ కార్పొరేట్ సంస్థలు అధిక నగదు నిల్వలు, మెరుగైన లాభదాయకత, విభిన్న రుణ వసతుల అందుబాటుతో 2025-26 ఆర్థిక సంవత్సరంలోకి ఎంతో బలంగా అడుగు పెట్టాయని "ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులు: 2024-25లో వృద్ధిబీ 2025-26 అంచనాలు" పేరిట ఆగస్టు బులెటిన్‌లో ప్రచురించిన వ్యాసంలో ఆర్‌బీఐ తెలిపింది. కార్పొరేట్ రంగం ప్రకటించిన పెట్టుబడి ప్రణాళికలు సమీప భవిష్యత్తులో క్యాపెక్స్ ధోరణులకు అద్దం పడుతున్నట్టు పేర్కొంది.




ముఖ్యాంశాలు..

మౌలిక వసతుల అభివృద్ధికి విధానపరమైన నిరంతర చర్యలు, నిలకడగా అదుపులో ఉన్న ద్రవ్యోల్బణం, తగ్గిన వడ్డీ రేట్లు, తేలిగ్గా నగదు లభ్యత, పెరిగిన సామర్థ్యాల వినియోగం ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలమైన అంశాలు.

ప్రైవేట్ పెట్టుబడుల్లో అధిక భాగం మౌలిక వసతుల రంగం ఆకర్షిస్తుంది. ప్రధానంగా విద్యుత్ రంగం అగ్రస్థానంలో నిలుస్తుంది.

సరికొత్త ప్రాజెక్టులపై పెట్టుబడి ప్రణాళికలు ప్రకటించడంతో వ్యవస్థలో కాలానుగుణంగా ఏర్పడే రికవరీతో పాటు సామర్థ్యాల నిర్మాణం జరుగుతున్న సంకేతం వెలువడింది. కార్పొరేట్ సంస్థలు తాము ప్రకటించిన పెట్టుబడి లక్ష్యాలను వాస్తవిక పెట్టుబడులుగా మార్చేందుకు ఇది సానుకూల సంకేతం.

## కొత్త మోడళ్లతో మార్కెట్లో పట్టు



కోల్‌కతా: దేశీయ ద్విచక్ర వాహన మార్కెట్లో తన వాటాను మరింత పెంచుకునేందుకు హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్ఐ) ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో కంపెనీ వాటా 28 శాతంగా ఉందని, కొత్త మోడళ్ల విడుదల ద్వారా ఈ వాటాను మరింత పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్‌ఎంఎస్ఐ డైరెక్టర్ యోగేశ్ మాథుర్ వెల్లడించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 100సీసీ, 125సీసీ విభాగంలో కొత్తగా రెండు బైక్స్‌ను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు.మార్కెట్లోకి సీబీ 125 హార్నెట్: హైదరాబాద్ మార్కెట్లోకి సరికొత్త హోండా సీబీ125 హార్నెట్, షైన్ 100డీఎక్స్ మోటార్‌సైకిళ్లను హెచ్‌ఎంఎస్ఐ జోనల్ హెడ్ సునీల్ రెడ్డి విడుదల

## లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..




గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారాన్ని సానుకూలంగా ప్రారంభించాయి. గత వారం వరుస నష్టాలతో 80 వేల దిగువకు పడిపోయిన సెన్సెక్స్ ఈ రోజు మళ్లీ కోలుకుంది. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ మళ్లీ 80 వేల మార్క్‌ను దాటింది. చైనాతో భారత్ స్నేహం చిగురిస్తుందనే అంచనాలతో సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో ఉన్నాయి గత శుక్రవారం ముగింపు (79, 809)తో పోల్చుకుంటే సోమవారంవారం ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి ఎగబాకింది. పలు రంగాలు లాభాల్లో సాగుతున్నాయి. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 391 పాయింట్ల లాభంతో 80, 201 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 124 పాయింట్ల లాభంతో 24, 551 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో బీఎస్‌ఈ లిమిటెడ్, హిందుస్థాన్ జింక్, సీజీ పవర్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, కేన్స్ టెక్నాలజీస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. మారుతీ సుజుకీ, ఎస్బీఐ కార్డ్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ లాంబార్డ్, రిలయన్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 749 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 312 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.23గా ఉంది.

## భారీగా తగ్గిన ధరలు



ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కస్టమర్లకు గుడ్‌న్యూస్ చెప్పాయి. గ్యాస్ సిలిండర్ల ధరలను భారీగా తగ్గించాయి. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గిస్తూ ఆదివారం ప్రకటన చేశాయి. ఈ నిర్ణయం కారణంగా హోటల్స్, రెస్టారెంట్లు, ఇతర బిజినెస్‌లకు లాభం చేకూరనుంది. తగ్గిన ధరలతో కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల అమ్మకం సోమవారం( సెప్టెంబర్ 1)నుంచి ప్రారంభంకానుంది. దేశ రాజధాని ఢిల్లీలో నిన్నటి వరకు 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధర 1631.50 రూపాయలు ఉండేది.ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తీసుకున్న తాజా నిర్ణయంతో 51.50 రూపాయలు తగ్గింది. గ్యాస్ సిలిండర్ 1,580 రూపాయలకే అందుబాటులోకి వస్తోంది. తగ్గిన ధరల కారణంగా హోటళ్లు, ధాబాలు, టిఫిన్ బండ్లు, చిన్న స్థాయి ఫుడ్ బిజినెస్‌లకు ఊరట లభిస్తుంది. తగ్గింది తక్కువ మొత్తమే అయినా.. ఓవర్ ఆల్ కాస్ట్‌పై ఈ ప్రభావం చాలా పాజిటివ్‌గా ఉంటుందని వాణిజ్య నిపుణులు అంటున్నారు. కాగా, ఇంటర్‌నేషనల్ ఎనర్జీ ధరల్లో కదలికల్ని బట్టి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతీ నెలా ధరల్ని మారుస్తూ ఉంటాయి. గ్యాస్ సిలిండర్ల ధరల్ని పెంచటం లేదా తగ్గించటం చేస్తుంటాయి. హైదరాబాద్ నగరంలో కొంతమంది గ్యాస్ డీలర్లు, డెలవరీ బాయ్‌లు రెచ్చిపోతున్నారు. కస్టమర్ల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారు. డీలర్లు, గ్యాస్ డెలివరీ బాయ్‌ల అక్రమాలపై పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ మాచన రఘునందన్ స్పందించారు.

## ఆచితూచి అడుగేయండి



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. అయితే జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలను మించటం, ట్రంప్ టారిఫ్స్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు అడ్డుకోవటం వంటి వార్తలు సానుకూల సెంటిమెంట్‌ను నింపే వీలుంది. అదే జరిగితే మార్కెట్లో పుల్‌బ్యాక్ ర్యాలీకి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆటోమొబైల్, యాన్సిలరీస్, ఎఫ్‌ఎంసీజీ, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్, రిటైల్, ఎలక్ట్రికల్స్ వంటి రంగాలు మాత్రమే కొంత బలం ప్రదర్శిస్తున్నాయి.ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా ఈ షేరు సైడ్‌వేసలో చలిస్తోంది. ఇప్పుడిప్పుడే మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతున్నాయి. వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.3,061 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,570 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.3,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.3,500 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.కోల్గేట్ పామోలివ్: గత ఏడాది సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. స్వల్పకాలిక మూమెంటమ్‌ను బట్టి రివర్సల్‌కు అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.2,331 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,300 స్థాయిలో ప్రవేశించి రూ.2,700 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు.

## టెక్ వ్యూ: 24, 500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 25,000 వద్ద విఫలమై వారం అంతా కరెక్షన్ ట్రెండ్‌లోనే ట్రేడయి 445 పాయింట్లు నష్టపోయింది. ప్రస్తుతం 24,300 స్థాయి (ఇక్కడే పలు బాటమ్‌లు ఏర్పడ్డాయి) కన్నా స్వల్పంగా పైన ఉంది. మిడ్‌క్యాప్-100 (1900 పాయింట్లు), స్మాల్‌క్యాప్-100 (690 పాయింట్లు) సూచీలు కూడా గత వారం భారీగా నష్టపోయాయి. గత కొద్ది వారాల్లో నిఫ్టీ 750 పాయింట్లకు పైగా నష్టపోయిన కారణంగా మార్కెట్లో ప్రస్తుతం టెక్నికల్ రికవరీకి ఆస్కారం ఉంది. అదే సమయంలో మానసిక అవధి 24,500కి చేరువవుతోంది. అంతే కాదు...ఆగస్టు నెలవారీ చార్టులు బలహీనంగా క్లోజ్ కావడం మరింత అప్రమత్తతను సూచిస్తోంది. సానుకూలత కోసం మార్కెట్ ప్రస్తుత స్థాయిల్లో టెక్నికల్‌గా కన్సాలిడేట్ కావడం అవసరం.బుల్లిష్ స్థాయిలు: గత వారం మార్కెట్ నిట్టనిలువుగా పతనమైనందు వల్ల మొదట నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధం 24,500 కన్నా పైన నిలదొక్కుకుంటే మైనర్ పాజిటివ్ ట్రెండ్ ఏర్పడుతుంది. ప్రధాన నిరోధం 24,700. స్వల్పకాలిక నిరోధం 25,000.బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా ట్రెండ్‌లో సానుకూలత కోసం కీలక

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006